బయోమెట్రిక్ యంత్రాన్ని దుకాణంలోనే ఉంచాలి: కలెక్టర్


చౌకధర దుకాణంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: చౌకధర దుకాణంలో బయోమెట్రిక్ యంత్రం అందుబాటులో లేకపోవడంతో రేషన్ డీలర్ పై కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి పట్టణం కేడీఆర్‌నగర్‌లోని 16వ చౌకధర దుకాణాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీలరుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ యంత్రాన్ని దుకాణంలోనే ఉంచాలని, ఇంటి వద్దకు ఎలా పెడతారని నిర్వాహకులను అడిగారు. సరకులకు సంబంధించిన దస్త్రాలను, నిల్వ ఉన్న బియ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, డీసీవో ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

వనపర్తి న్యూటౌన్ : వనపర్తి పట్టణం ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో ఈవీఎంల గోదాంను గురువారం కలెక్టర్ ఆదర్శ్ సురభి తనిఖీ చేశారు. దస్త్రాలను ఆయన పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా ఆయనతో పాటు రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 4 గేట్ల ద్వారా నీటి విడుదల



శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండింది. గురువారం 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 67,876 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు 885 అడుగుల (212.387 టీఎంసీలు)గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,18,776 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది.

చేదెక్కుతున్న చెరకు

ప్రత్యామ్నాయం వెతుకుతున్న రైతులు


చెరకు సాగు

కొత్తకోట, న్యూస్‌టుడే: అందరికీ(చక్కెర) తీపిని అందించే చెరకు రైతులు మద్దతు ధర లభించక, చేసిన వ్యవసాయంలో వచ్చిందంతా అప్పులు చెల్లించేందుకే సరిపోయి కుదేలవుతున్నారు. ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలు, ఎరువులు, కూలీల వేతనాలు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. సరైన దిగుబడులు లేక, చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లేక కర్షకులకు కష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరకును మరిచి ఇతర పంటలకు మద్దతు ధర పెంచడం, బోనస్‌లు ఇవ్వడం వారిని పంట మార్పిడి వైపు చూసేలా చేస్తోంది.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం : ఉమ్మడి జిల్లాలో ఉన్న కృష్ణవేణి చక్కెర కర్మాగారం పరిధిలో ఏడేళ్ల క్రితం ఆరు వేల మంది రైతులు 15 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లానే కాకుండా పొరుగు జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్ నుంచి కూడా చెరకు రైతులు ఉన్నారు. గతేడాది 5,950 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. దాదాపు 2 వేల మంది ఈ పంట సాగు చేస్తుండగా యాజమాన్యం నుంచి తగిన ప్రోత్సాహం ఉండటం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఒక్కసారి విత్తనాలు వేస్తే నాలుగేళ్లు పంట వస్తుంది. తొలి ఏడాది అధిక పెట్టుబడులున్నా తర్వాత ఏడాది పెట్టుబడి సమస్యలు అంతగా ఉండవని సాగులోకి దిగిన రైతులు ఏటికేడాది ఇక చాలు అని చెరకు సాగుకు దూరమవుతున్నారు. ప్రస్తుతం రైతులకు రికవరీ రేటు ఆధారంగా రూ.3,340 మద్దతు ధర చెల్లిస్తున్నా అనేక కొర్రీలతో వారికి చేరే సరికి ఏమీ మిగలడం లేదని వాపోతున్నారు.



● స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర రూ. 5,600 ఇవ్వాల్సి ఉంది. రికవరీతో సంబంధం లేకుండా కోత, రవాణా ఖర్చులు పోను రూ. 3,500 చెల్లించాలన్నది యాజమాన్యాలు అంగీకరించకుంటే వచ్చే ఏడాది సాగు మరింత తగ్గుతుంది. బోనస్‌ను పరిగణలోకి తీసుకుంటే వరి సాగు లాభసాటిగా ఉంది. పత్తి, వేరుసెనగ, ఆముదం వంటి పంటలు వేసుకున్నా లాభపడొచ్చు.

- రాజన్న, ఉమ్మడి జిల్లా చెరకు రైతు సంఘం అధ్యక్షుడు

ఖర్చు రూ.లక్ష పైమాటే : ఎకరా చెరకు సాగు చేయాలంటే పెట్టుబడులన్నీ కలిపి తొలి ఏడాది రూ.లక్ష ఖర్చు చేయాల్సి ఉంటుందని కర్షకులు చెబుతున్నారు. గతేడాది కోత, రవాణా ఖర్చు టన్నుకు రూ.1,100 చెల్లించాల్సి వచ్చింది. ఒక్కో ఎకరాకు సరాసరి 30 టన్నుల చెరకు పండుతుంది. ప్రస్తుత ధరతో పోలిస్తే రైతుకు రూ.లక్ష వస్తోంది. వీటిలో కోత, రవాణా ఖర్చులు మినహాయిస్తే మిగిలేది రూ.77 వేలన్నమాట. ఏడాది పంట కోసం ఎరువులు, ఇతర పెట్టుబడులు అప్పుగా తేవాల్సిందే. అందుకు వడ్డీ చెల్లించాలి. ఇలా చెల్లింపుల్లో రవాణా కోత ఖర్చులు పోతే మిగిలింది ఎరువులు, ఇతర పెట్టుబడులకే సరిపోవడం లేదు. ఇక కౌలు రైతు పరిస్థితి మరీ దారుణం ఎకరాకు రూ.15 వేలు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రైతుకు ఎక్కడికక్కడ నష్టం వాటిల్లుతున్న తరుణంలో ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పచ్చదనం విరిసె.. పుడమి మెరిసె



కనుచూపు మేర భూమికి పచ్చని రంగేసినట్లు ఉన్న వరి పొలాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి శంకర సముద్రం జలాశయం వెనుక సాగు చేసిన పొలాలు దారిన వెళ్లే వారి చూపు తమ వైపు నిలిచేలా ఆకట్టుకుంటున్నాయి. కనుచూపు మేర ఇలా పచ్చదనంతో దర్శనమిస్తున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది.

- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

నవంబరు 7 నుంచి ప్రారంభం ● 8-10 తరగతుల విద్యార్థులు అర్హులు


పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

పోటీల వివరాలు ఇలా : విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో డిసెంబరు 14-16 వరకు నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపుతారు.

రాష్ట్ర స్థాయిలో.. : చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జేవీవీ జిల్లా ప్రతినిధి బాల్‌రాం తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

పరిష్కారం కాని సాంకేతిక సమస్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : సాంకేతిక సమస్య వల్ల నాలుగో రోజు కూడా వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మ్యానువల్‌గా అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 'ఇ-నామ్‌కు సాంకేతిక సంకటం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్త మార్కెట్లలో అధికారులు, వ్యాపారులు, రైతుల్లో చర్చ కొనసాగింది. మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఉన్నత అధికారులకు లేఖలు రాశారు. సాంకేతిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, జిల్లాలోని ఈ-నామ్ మార్కెట్లలో సాధారణ టెండర్ల ప్రక్రియతోనే పంట కొనుగోళ్లు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తెలిపారు.

స్థానిక పోరుకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలకు చేరిన కరదీపికలు


మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరిన ఎన్నికల మాడ్యుల్స్, కరదీపికలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయంపై స్పష్టత లేకపోయినా అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీలని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాల వారిగా బ్యాలెట్ పెట్టెల ఆవశ్యకత, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన కరదీపికలు జిల్లాలకు చేరాయి. వాటితో పాటు వివిధ రకాల ఫారాలు కూడా వచ్చాయి.

నాలుగు జిల్లాల్లో 6 కొత్త మండలాలు.. : ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వీటిని పరిగణలోకి తీసుకుని మండల ప్రాదేశిక స్థానాలను పునర్విభజన చేయనున్నట్లు సమాచారం. తద్వారా రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. జిల్లాలకు ఎన్నికల సామగ్రి చేరుతున్న నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మహ్మదాబాద్, కౌకుంట్ల మండలాలు ఏర్పడ్డాయి. వనపర్తి జిల్లాలో ఏదుల, జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవల్లి, నారాయణపేట జిల్లాలో గుండుమాల్, కొత్తపల్లి ఇలా మొత్తం 6 కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు పెరిగే ఆస్కారం ఉంది.

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సంఖ్య, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	ఎంపీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు
మహబూబ్‌నగర్	441	168	16	16	3,836	2,57,529	2,58,647
నాగర్‌కర్నూల్	464	212	20	20	4,140	3,23,705	3,22,689
వనపర్తి	260	128	15	15	2,366	1,83,382	1,84,135
జోగులాంబ గద్వాల	255	141	13	13	2,390	1,91,313	1,96,875
నారాయణపేట	280	147	13	13	2,544	1,98,199	2,05,547

గోదాముల్లో ఎన్నికల సామగ్రి

ఉమ్మడి జిల్లాలో 1,700 పంచాయతీలు, 15,276 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరగడంతో పాటు ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండో, మూడో విడత ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాముల్లో భద్రపరిచారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయా అనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. కొత్తగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రభుత్వం కులగణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడవు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో ఉత్కంఠ నెలకొంది.

కొత్త గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు వీరే

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లాలో కొత్తగా ఏడు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్త గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు, కార్యదర్శులను నియమించినట్లు డీపీవో సురేశ్ తెలిపారు.

కొత్త గ్రామ పంచాయతీలు

మండలం	కొత్తగా ఏర్పడిన పంచాయతీ	గ్రామ ప్రత్యేకాధికారి	గ్రామ కార్యదర్శి
గోపాల్‌పేట	జింకలబీడుతండా	భాస్కర్, ఏఈ పీఆర్	పరశురాములు
గోపాల్‌పేట	లక్ష్మీదేవిపల్లి	భాస్కర్, ఏఈ పీఆర్	అబ్దుల్‌జావీద్
ఖిల్లాగణపురం	ముందరితండా	వెంకటాచారి, ఎంపీడీవో	మిస్బవుద్దీన్
ఖిల్లాగణపురం	వసురాంతండా	పి.జయశంకర్, ఎంఈవో	కే.రాజు
పెద్దమందడి	నాగులకుంటతండా	పి.జయశంకర్, ఎంఈవో	డి.శరత్‌చంద్ర
కొత్తకోట	పాతజంగమాయపల్లి	అఖిల్, ఏఈ నీటిపారుదల	పి.ప్రదీప్‌కుమార్
కొత్తకోట	వడ్డెవాటతండా	చెన్నమ్మ, ఎంపీడీవో కొత్తకోట	ఎల్,మనోహర్‌గౌడ్

11 యూనిట్లలో జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు నుంచి వరద నీటి ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్ల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా జల విద్యుత్తు ఉత్పత్తికి 36,969 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.878, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.261 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం జల విద్యుత్తు ఉత్పత్తి ఎగువన 305.452, దిగువన 287.572 మిలియన్ యూనిట్లకు చేరినట్లు ఎస్ఈ జెన్‌కో (ఓఅండ్ఎం) సూరి బాబు తెలిపారు.

సత్యం TET+DSC కోచింగ్ సెంటర్
TET - PAPER I, II & SGT
WANTED CLERK
అవనిగడ్డ HYD ఫ్యాకల్టీలచే
తరగతులు (ఆదివారం) 27-10-24, 9:36 AM
SUBJECT: TRI METHOD; వేణుసార్, HYD
చైతన్య జూ॥ కాలేజీ, శెట్టి కాంప్లెక్స్ దగ్గర, రాజేంద్రనగర్
MAHABUBNAGAR-9440744469

MANASA COLLEGE OF EDUCATION
(Approved by N.C.T.E. – New Delhi and Affiliated to Palamuru University - Mahabubnagar)
AMADABAKULA STAGE, KOTHAKOTA- 509381, WANAPARTHY – DISTRICT, TELANGANA STATE.
COLLEGE CODE: MNSA
SPOT ADMISSIONS INTO B.Ed. COURSE FOR THE ACADEMIC YEAR 2024-2025
The following Candidates allotted by Convener TG Ed.CET-2024, has not reported to the college till date. He/She has to report the college on or before 28-10-2024 at 5 P.M. otherwise his/her admission will be treated as cancelled and vacancy will be filled with eligible candidates in Spot Admissions on 30-10-2024 at 11:00 A.M. to 5:00 P.M. in the college premises.

Sl. No	Rank	H.T. No	NAME	REG	CASTE	SEX	ALLOTMENT DETAILS	PHASE	METHODOLOGY
1	26517	2416202007	A SNEHA	OU	BC-B	F	REG_BCB_OU_FEMALE	Special Round	BIOLOGICAL SCIENCES
2	26785	2415701087	MALOTH SIRISHA	OU	ST	F	REG_ST_OU_GEN	Special Round	BIOLOGICAL SCIENCES
3	28466	2426202110	PATHLAVATH MOUNIKA	OU	ST	F	REG_ST_UNR_FEMALE	Special Round	BIOLOGICAL SCIENCES
4	14217	2426801447	K SHIVA SHANKAR	OU	BC-B	M	REG_BCD_OU_GEN	Special Round	MATHEMATICS

and Seventeen (17) Seats are not allotted to our college from TG Ed.CET- 2024. Therefore Total Vacant Seats: 21 Seats.
Contact: 9848466279, 8309164016 - Correspondent: Saka Balanarayana

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బాలల హక్కుల పరిరక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఇబ్బందులపై ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖిల్లాగణపురం మండలంలో 2023లో 5 బాల్య వివాహాలు జరిగాయని అలాగే 2024లో 2బాల్య వివాహాలు జరిగినట్లు తెలిపారు. పర్యవేక్షణ లోపం వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నట్లు వివరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల తీరుపై అసహనం

వెంకటాంపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రూ. 6.34 లక్షలతో నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించి పనుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో కొత్త ఫ్యాన్‌లు పెట్టకపోవడం, కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడం, నాలుగు ట్యూబ్ లైట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు మాత్రమే పెట్టడం, పాఠశాల పై కప్పు, గోడలకు సిమెంట్ చేయకపోవడంతో సంబంధిత గుత్తేదారు, ఏఈ సాయిరెడ్డితో చరవాణిలో మాట్లాడి పనులు అన్ని సక్రమంగా చేయించిన తర్వాత ఫొటోలు పంపించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటాచారి, తహసీల్దార్ సుగుణ, ఐసీడీఎస్ అధికారి ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాలను వమ్ము చేయొద్దని, ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధనకు విద్యార్థి దశ నుంచే గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షలో వచ్చే మార్కులను చూసి నిరాశ చెందకుండా సంతోషంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్ణయించుకొని క్రమశిక్షణతో సాధించుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఎస్పీతో పలు సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జగన్‌నాయక్, మెకానికల్ హెచ్‌వోడీ శ్యామ్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనంలో అసాంఘిక కార్యకలాపాలు



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాజపేట గ్రామంలోని ఉన్నత పాఠశాల భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేయడంతో ఆ పాఠశాల భవన ఆవరణ మద్యం ప్రియులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు నూతన భవనం కోసం చేపట్టిన నిర్మాణాలు ఏడేళ్లుగా సాగుతూ నిధులు లేక మధ్యలోనే గుత్తేదారులు వదిలేశారు. గత ఉమ్మడి రాష్ట్రం మంజూరై తెలంగాణ ఏర్పాటు అనంతరం నిర్మాణం మొదలు పెట్టి రెండు తరగతులు పూర్తి చేశారు. వీటితో సరిపోక రాష్ట్రం ఏర్పాటుతో జడ్పీ ఛైర్మన్ నిధులతో మరో రెండు గదులను, ఎన్ఆర్‌జీఎస్ కింద శౌచాలయాలు, వంట గది, భోజన శాల షెడ్, ప్రహరీ నిర్మాణాలను చేపట్టారు. దాదాపుగా ఈ నిర్మాణాలకు రూ.24 లక్షలకు పైగా ఖర్చు చేసిన నిర్మాణం పూర్తి కాకుండా పోయింది. దీంతో నిర్మానుష్యంగా మారడంతో ఆ ప్రాంతం అన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

● జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామ మధ్యలో ఉంది. ఈ పాఠశాల ప్రాంగణంలోనే ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు రెండు ఉన్నాయి. వాటిలో విద్యార్థుల సంఖ్య ఉన్నత పాఠశాలలో 165, కాగా ప్రాథమిక పాఠశాలలో 100 దాకా ఉన్నారు. ఉన్న స్థలంలో రెండు పాఠశాల నిర్వహణకు ఇబ్బందుల దృష్ట్యా ఉన్నత పాఠశాలకు ప్రత్యేక భవన నిర్మాణానికి పునాదులు వేశారు. వాటి పనులు పూర్తి కాక పోవడంతో పాఠశాల నిర్వహణలో లేకపోవడంతో పలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దాని నిర్మాణం పూర్తి చేసి పాఠశాల నిర్వహణ జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.. : రాజపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోసం చేపట్టిన భవన నిర్మాణం నిధుల కొరతతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తి పనులు పూర్తి చేయించి, పాఠశాల నిర్వహణలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- మద్దిలేటి, వనపర్తి మండల విద్యాశాఖ అధికారి

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా? అయితే వారికి అందించండి అభినందనల చందనాలు. ఆకాంక్షించండి వారి భావిజీవిత సుఖమయ ఆనందాలు. తెలియజేయండి ఈనాడు ద్వారా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.
సంప్రదించండి :
మహబూబ్‌నగర్ : 8008709794, 8008882661, 8008550249
వనపర్తి : 8008709798 నాగర్‌కర్నూల్ : 8008705545
జోగులాంబ గద్వాల : 8008882662, నారాయణపేట: 7680076453

(c) eenadu

విద్యుత్తు శాఖా మేలుకో..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, తీగల పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం గాలివీచినా తీగలు తెగి ప్రమాదాలు తావిచ్చేలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాసుపల్లిలో ఓ రైతు పొలంలో కనిపించిన చిత్రమిది. విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కర్రలు దన్నుగా ఉంచి తీగలు వేలాడకుండా ఆ రైతు ఏర్పాటు చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

భిన్న రీతిలో ఫ్లెక్సీలు



టైరోడ్ వద్ద గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కృష్ణా, న్యూస్‌టుడే : ఏడాది క్రితం తమ కుమార్తె విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అందుకు అల్లుడు, అత్తమామలే కారణమని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడేబల్లూరుకు చెందిన చెన్నయ్యగౌడ్ ఆరోపించారు. నిందితుల ఆచూకీ తెలియచేయాలని కోరుతూ వినూత్న రీతిలో కృష్ణా మండలం టైరోడ్, మక్తల్, మరికల్, మహబూబ్‌నగర్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలూకా శంకరపల్లిలో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అత్తమామలు గ్రామం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. వివాహ సమయంలో తమ కుమార్తెకు ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇవ్వమని చెప్పి ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కోసం తెలంగాణ, కర్ణాటకలో వెయ్యి బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి బీచుపల్లికి తరలివచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం, భాజాభజంత్రీల నడుమ కల్యాణం కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చక్కని జీవన శైలితోనే ఆరోగ్యం పదిలం

● మధుమేహం, గుండె, ఈఎన్‌టీ సమస్యలపై వైద్యుల సూచనలు

ఈనాడు ఈటీవీ అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన జనం

న్యూస్‌టుడే, పాలమూరు : అప్రమత్తత, చక్కని జీవన శైలితోనే వ్యాధులను దూరంగా ఉంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత ఇలా.. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్ సింగ్, మధుమేహం, ఇతర అనారోగ్యాలపై ప్రముఖ ఫిజీషియన్ డా. శ్రీనివాస్‌రెడ్డి, గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డా. మహేశ్‌బాబు అవగాహన కల్పించటంతో పాటు సందేహాలు నివృత్తి చేశారు. చాలా ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న తాము ఇన్సులిన్ తీసుకుంటున్నామని, ఇది ప్రమాదకరమా అని కొందరు అడగగా అదేమీ కాదని, మాత్రల కంటే ఇదే నయమని వైద్యులు తెలిపారు. నిద్ర సమస్య ఉందని కొందరు చెప్పగా తగినంత శారీరక శ్రమ ఉంటే తప్పక నిద్ర వస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి గొంతు కింద పెద్ద గడ్డతో బాధపడుతున్నానని ఒకరు చెప్పగా జనరల్ ఆసుపత్రికి వస్తే చికిత్సలు అందిస్తామన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నేరుగా మాత్రలు కొన్నుకుని, సామాజిక మాధ్యమాల్లో దొరికే సమాచారంతో సొంత వైద్యం చేసుకోవద్దని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 6 నుంచి 7 గంటలు నిద్ర పోవటంతో పాటు గంట పాటు వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా జీవించడం అవసరమని తెలిపారు.

పిండి పదార్థాలు తక్కువ తీసుకోవాలి



ప్రపంచంలోనే అత్యధిక మధుమేహం (డయాబెటిక్) బాధితులతో ఈ వ్యాధికి భారత్ రాజధానిగా మారింది. కార్బోహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, దుంపలు ఆహారంగా తీసుకునే అలవాటు ఉండటమే కారణం. గతంలో 40 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు 25 ఏళ్ల వారికి కూడా టైప్-2 వ్యాధి వస్తోంది. ఒత్తిడి, మానసిక సమస్యలతో సతమతం కావటం, కీళ్లు, ఇతర నొప్పుల మందులు, స్టెరాయిడ్స్ ఎక్కువగా వాడటం వల్ల కూడా వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం వల్ల కంటి రెటీనా కూడా దెబ్బతింటుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం, నరాల బలహీనతలు, మంటల తదితర సమస్యలు, వస్తాయి. ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం చాలా తక్కువగా తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఆరోగ్యం కోసం, మధుమేహం నియంత్రణకు రోజూ 5 కి.మీ.ల మేర నడవటం చాలా ముఖ్యం.

- డా.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్

చెవిలో ఏది పడితే అది పెట్టకూడదు..



చెవి ద్వారా వినటమే కాదు దానితో పనులు జరుగుతాయి. అది చాలా సున్నితమైంది. చాలా మంది చెవిలో దురదగా అనిపిస్తే వెంటనే ఇయర్ బడ్స్, పుల్లలను పెట్టి అందులో ఉన్న వ్యర్థాలు బయటకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. వయస్సు పెరిగే కొద్దీ వినికిడి లోపాలు వస్తుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నపిల్లల్లో టాన్సిల్స్ వస్తుంటాయి. తర్వాత తగ్గిపోతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చదువులో వెనకబడుతున్న చిన్నారుల్లో వినికిడి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్సలు చేయించాలి. చిన్నారులు సపోటా, శీతాఫలాలు వంటివి తినే క్రమంలో వాటి గింజలు కూడా మింగే అవకాశం ఉంటుంది. అవి శ్వాస నాళికలోకి వెళ్లి అడ్డుపడితే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. పసివాళ్లకు ఇలాంటి గింజలు అందుబాటులో ఉండకుండా పడేయాలి. నోటి క్యాన్సర్ రాకుండా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో పుండు ఎక్కువ కాలం మానకపోతే ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలి. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని రకాల చికిత్సలు అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ఈఎన్‌టీ విభాగాధిపతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

బరువు పెరిగితే గుండెపై ఒత్తిడి..



బరువు అధికంగా పెరగడం వల్ల గుండెపై ఒత్తిడి పెరిగి హృద్రోగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ధూమపానం కూడా గుండె వ్యాధులకు దారితీస్తుంది. మహిళలతో పోలిస్తే గుండె జబ్బులు, మరణాలు పురుషుల్లోనే ఎక్కువ ఉంటాయి. రుతుస్రావం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో గుండెపోటు వచ్చిన వారిలో 99 శాతం మంది బతుకుతున్నారు. బొడ్డు పైభాగం నుంచి గొంతు కింది భాగం వరకు గతంలో వచ్చిన నొప్పి కాకుండా కొత్త రకమైన తీవ్రమైన నొప్పి వస్తే అది గుండెపోటుకు సంకేతంగా భావించి వెంటనే అప్రమత్తం కావాలి. ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు ఎక్కువగా రావడం తదితర లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండెపోటు వచ్చిన మూడు నిమిషాల్లో వారికి సీపీఆర్ ప్రారంభించాలి. వెంటనే డిస్ప్రిన్ టాబ్లెట్ నాలుక కింద పెడితే గుండెపోటు తీవ్రతను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యులకు చూపించి చికిత్సలు ప్రారంభిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు.

- డా.మహేశ్‌బాబు

దందా వెనక ఆ ముగ్గురు!

జీరో ఇసుక పేరుతో అక్రమం





తుమ్మిళ్ల రీచ్ వద్ద ఇసుక నిల్వలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో జీరో ఇసుక పాలసీ సరిహద్దులోని గద్వాల జిల్లాలో కాసులు కురిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇసుకాసురులు ఏకమై అధికారుల అండదండలతో జీరో ఇసుక పాలసీని ఇక్కడ యథేచ్ఛగా అమలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. వెనుక గద్వాల జిల్లాకు చెందిన అధికారపార్టీ బడా నాయకుడి భరోసా, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. సరిహద్దు గుండా ఒక ఇసుక టిప్పర్ జిల్లాలోకి అడుగు పెడితే అధికార పార్టీ నేతలు నెలకు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, అలంపూర్ పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో ఓ యువకుడు ఇందులో ప్రధాన భాగస్వాములని తెలుస్తోంది.

అధికార పార్టీ నాయకుడి హస్తం : జిల్లాలో అధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇసుక తవ్వకానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడికి మధ్య కమీషన్ల విషయంలో వివాదం ఏర్పడటంతో ఐదు నెలలుగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మన ఇసుక, మన వాహనం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక దొరకడం లేదు. తుమ్మిళ్ల రీచ్ వద్ద 40వేల టన్నుల ఇసుక అంటే సుమారు 2 వేల టిప్పర్ల ఇసుక దంపుల రూపంలో అందుబాటులో ఉండటంతో, ఈ ఇసుక కోసం 150 టిప్పర్ల యజమానులు మన ఇసుక, మన వాహనం కింద ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించి నెలలు గడిచినా అందడం లేదు. మరోవైపు సరిహద్దుల గుండా బ్లాక్ మార్కెట్లో ఇసుక సులభంగా దొరుకుతోంది. అధికారికంగా ఇసుక డంపులు అందుబాటులో ఉన్నా, నిర్మాణదారులకు ఎందుకు అందడం లేదో అంతు చిక్కని విషయం. ఈ తతంగం వెనుక బడానాయకుడి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మన ఇసుక, మన వాహనం కింద విక్రయించడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. మన ఇసుక, మన వాహనం కింద టన్ను ఇసుక రూ. వెయ్యి కాగా, బ్లాక్‌లో టన్ను ఇసుకను దళారులు రూ.2,800లకు విక్రయిస్తూ రోజూ లక్షలార్జిస్తున్నారనే నిర్మాణ రంగంలో ఉన్న పలువురు అంటున్నారు. గద్వాల పట్టణానికి రోజుకు 6 నుంచి 10 టిప్పర్లు (ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 42 టన్నులు) ఇసుక రవాణా అవుతోంది.

చేస్తున్నారు ఇలా..

తుంగభద్ర నది అవతలి వైపున ఉన్న కర్నూల్ పట్టణ శివారు ప్రాంతాల నుంచి కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన వ్యక్తికి మధ్య ఉన్న అవగాహన ప్రకారం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ సరిహద్దు అయిన గట్టు మండలంలోని బల్గెర వరకు టిప్పర్‌ను తీసుకుని వస్తారు. అక్కడి నుంచి ధరూర్ మీదుగా గద్వాల పట్టణానికి ఆ టిప్పర్ చేరుకునే విధంగా పక్కా ప్లాన్‌తో సరఫరా చేస్తున్నారని సమాచారం. పదిహేను రోజుల కిందట ఇలా మంత్రాలయం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధరూర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కృష్ణానది అవతలివైపునున్న వనపర్తి జిల్లాలోని రంగాపురం, రాంపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా గద్వాల పట్టణానికి రవాణా జరుగుతోంది. ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన ఓ యువకుడు ఇందులో కీలక సూత్రధారి. టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రంగారెడ్డి వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'బెటాలియన్లు కావు.. రాచరికపు బంధిఖానాలు'



ఎర్రవల్లిచౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పదో పటాలం పోలీసు కుటుంబాలు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: 'ఇవి బెటాలియన్లు కావు రాచరికపు బంధిఖానాలు' అంటూ ప్రత్యేక పోలీసు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో పనిచేసే పోలీసు కుటుంబాలలో కొందరు గురువారం సాయంత్రం ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం తీసుకురావాలంటూ ఎర్రవల్లిచౌరస్తాలోని జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై నిరసన తెలిపిన కుటుంబీకులకు ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేశ్, స్వాతి నచ్చచెప్పి నిరసన విరమింపజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నెలలో 26 రోజులు డ్యూటీలు వేస్తుండటంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పటాలంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సివిల్, ఏఆర్‌లాగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలు డ్యూటీలు ఉంటూ కుటుంబాలను చూసుకునేలా మార్పులు తేవాలంటూ వారు డిమాండ్ చేశారు.

ఎగువ జూరాలలో సాంస్కృతిక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సూరిబాబు, చిత్రంలో సీఈ రామసుబ్బారెడ్డి


ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎగువ జూరాల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం టీఎస్ జెన్‌కో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ సూరిబాబు మాట్లాడారు. ఉద్యోగులకు విధుల నిర్వహణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన పది విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు.

తెగిపడిన హెచ్‌టీ తీగలు

కాలిన ఫ్యాన్లు, మీటర్లు ● ఒకరికి గాయాలు



జావిద్ కాలికి గాయాలు



జక్లేర్‌లో దగ్ధమైన మీటర్లు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హెచ్‌టీ విద్యుత్తు లైన్ తీగలు తెగి పడిన ఘటన మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జావిద్ ఇంటి ముందు ఉన్న హెచ్‌టీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్‌పై పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆ ప్రాంతంలోని నివాస గృహాల్లో 12 ఫ్యాన్‌లు, 10 విద్యుత్తు మీటర్లు కాలిపోయాయి. తీగపడిన క్రమంలో తూలిపడిన జావిద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే విద్యుత్తు ఉపకేంద్రానికి సమాచారం ఇచ్చి, సరఫరా నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులు

రాజోలి, న్యూస్‌టుడే: మా అభిప్రాయం తీసుకోకుండా ఇథనాల్ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారంటూ పరిసర గ్రామాల ప్రజలు పనులను అడ్డుకున్న సంఘటన గద్వాల జిల్లా రాజోలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గాయత్రి సంస్థ వారు పెద్ద ధన్వాడ గ్రామ శివారులో రైతుల నుంచి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తీసుకున్న భూమి పక్కనే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 152 ఎకరాలు ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట పరిశ్రమ పనులు చేపట్టేందుకు రాగా ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తిరిగి గురువారం సంబంధిత సంస్థ వారు పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు స్తంభాలను, జేసీబీ, టిప్పర్, కంకర తీసుకురావడంతో పాటు గుడారాలను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజి క్యాంపు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని సంస్థ సిబ్బందితో వాగ్వాదం చేశారు. సీఐ టాటాబాబు, తహసీల్దార్ రాంమోహన్, ఎస్సై జగదీష్ ప్రజలను నిలువరించి మాట్లాడారు. సంస్థ వారు అనుమతులు చూపకుండా పనులు ఎలా చేపడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు తమకు అన్ని అనుమతులున్నాయని సంస్థ వారు తెలిపినప్పటికీ వాటిని చూపకపోవడంతో పనులు నిలిపి వేసి వెళ్లిపోవాలని డిమాండు చేశారు. సీఐ, తహసీల్దార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి అనుమతులు చూపించి పనులు ప్రారంభించాలని సూచించగా వారు పనులు ఆపేశారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

రాయపురం క్వారీలో పేలుళ్లు: ఇద్దరికి గాయాలు



రాయి తగిలి గాయాలు

గద్వాల, న్యూస్‌టుడే: గట్టు మండలం రాయపురం శివారులో 199 సర్వే నంబర్‌లో భారత మాల పనుల కోసం క్వారీలో పేలుళ్లు జరపగా పక్కనే పొలంలో పనిచేసుకుంటున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీలో పేలుళ్లు జరపటంతో బండరాళ్లు ఎగిసి పడి హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మకు గాయాలయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా పేలుళ్లు జరపటంతో పక్కనే పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గాయపడ్డారని గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప వివరించారు. పేలుళ్లకు అనుమతులున్నాయో లేదో తమకు తెలియదని, చుట్టు పక్కల రెండు కి.మీ. దూరం వరకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కంపెనీ ప్రతినిధులదని, ఆదేదీ చేయకుండా పేలుళ్లు నిర్వహించటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈనెల 21 తేదీ నుంచి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని, సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తహసీల్దార్ సరితారాణి పేర్కొంటున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి

సీడ్ ఆర్గనైజర్‌పై కేసు

మల్దకల్, న్యూస్‌టుడే: బంగారం దొంగతనం చేసిందనే నెపంతో బాలిక (17)ను మల్దకల్ ఠాణాకు పిలిపించి విచారించగా ఆ అవమానం భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాలిక చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఈ సంవత్సరం మార్చి నెల నుంచి గద్వాలలోని బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనులు చేయడానికి చేరింది. ఆగస్టు నెలలో తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని దానిని బాలిక దొంగతనం చేసిందని అనుమానం వ్యక్తం చేసి అడిగారు. ఆ తర్వాత గొలుసు ఇంట్లోనే దొరికిందని చెప్పారు. తిరిగి అక్టోబరు 11న గొలుసు దొంగతనం చేసిందని మల్దకల్ ఠాణాలో రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు బాలికను, తల్లిని ఠాణాకు పిలిపించి విచారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అవమానం భరించలేక బిజ్వారంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం గద్వాలకు అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి కవిత ఫిర్యాదు మేరకు సీడ్‌ఆర్గనైజర్ రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

గమనిక

JOBS

Book Your 5 Lines Classified Advertisement for B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మదనాపురం : 8074538150 వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 వీపనగండ్ల : 9121229043



సమస్య: పట్టణం నుంచి నాగల్‌కడ్మూర్ గ్రామానికి వెళ్లే బీటీ రహదారికి ఇరువైపుల ముళ్లపొదలు పెరిగి మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముళ్ల పొదలు తొలగించాలి.
- శ్రీనివాసులు, అమరచింత

సమాధానం: బీటీ రహదారికి ఇరువైపుల పెరిగిన ముళ్లపొదలు ఉపాధిహామీ పథకంలో తొలగిస్తాం. ప్రమాదాలు జరగకుండా ఆర్అండ్‌బీ అధికారులతో మలుపులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. **- నర్సింహ్మయ్య, ఎంపీవో, అమరచింత**

– న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర.** వెంకటేశ్వర: **పొట్టేలు.** శ్రీరామా: **వేణం**
– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముచెన్నకేశవులు అన్నారు. వనపర్తి పట్టణం పాలిటెక్నిక్ కళాశాలలో వికలాంగుల పోరాట సమితి నాయకులతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జడ్చర్లలో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభకు మాదిగ ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు, వీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య, మహాజన సోషలిస్టు పార్టీ, వీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. తరలుతున్న పత్తి

పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు

తక్కువకు కొంటున్న దళారులు, కర్ణాటక వర్తకులు



ఉండవల్లి: సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించిన పత్తిమిల్లు

న్యూస్‌టుడే- కోస్గి, ఉండవల్లి : పత్తి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలను వర్షాలు దెబ్బతీశాయి. ఉన్న పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పెద్ద ఎత్తున పంట కర్ణాటకకు తరలిపోతోంది. కొందరు రైతులు పత్తి తీసి ఇళ్లలో నిల్వ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి నాని ఇబ్బందులు పడుతున్నారు. భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సిద్ధమయినా, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం పెరుగుతుందని, అందుకే అధికారులు వెనుకడుగు వేస్తున్నారని రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు

కర్షకుల నిరసనలు: ధన్వాడలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులకు కొందరు తరలిస్తున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని సరహద్దు ప్రాంతాల్లో కర్ణాటక దళారులు పంటను తరలిస్తున్నారు. కోస్గి, మద్దూరు, గండీడ్ మండల రైతులు వికారాబాద్ జిల్లా తండూరులో విక్రయిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ వాటిని ఆలస్యంగా ప్రారంభిస్తుండడంతో దళారులు రంగప్రవేశం చేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

జిల్లా	2022	2023	2024
మహబూబ్‌నగర్	1,15,380	85,830	79,128
నారాయణపేట	2,05,807	1,84,597	1,85,150
నాగర్‌కర్నూల్	3,52,429	2,35,530	2,10,970
వనపర్తి	21,689	17,411	12,301
జోగులాంబ గద్వాల	2,22,908	1,44,075	1,20,597

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..: ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 5.88 లక్షల ఎకరాలలో పత్తి సాగు అయ్యింది. గత ఏడాది కన్నా కొంత తగ్గింది. 41.19 లక్షల కింటాళ్ల పత్తి దిగుబడి ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే పత్తి తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గతంలో అధికారులు సూచించారు.

తక్కువ ధరకు అమ్ముకున్నా..

ఈ ఏడాది 9 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాను. సుమారు 70 క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటా రూ.6,150 చొప్పున గ్రామంలోనే వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు విక్రయించాను. సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు కనీసం రూ.వెయ్యి అదనంగా వచ్చేది. నాకన్నా తక్కువ అమ్ముకునేవారూ ఉన్నారు. రైతుల వేదన అధికారులు ఆలకించాలి.



- చిన్న మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

ఉన్నతాధికారులకు నివేదించాం..: సీసీఐ కేంద్రం ఏర్పాటు గురించి అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ కొమ్ముకుమార్, ఉన్నతాధికారులతో చర్చించానని, దీపావళి తర్వాత కేంద్రం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లాస్వామి అన్నారు.

హమ్మయ్య.. స్థలం దొరికింది!

ప్రస్తుతం వరి కోతలు ప్రారంభంకావడంతో ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలతో భయపడుతున్న అన్నదాతలు రహదారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఖాళీ స్థలాల కోసం రైతుల మధ్య పోటీ పెరగడంతో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ రాళ్లను వరుసలో పెట్టి స్థలాలను జప్తు చేసుకొని ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ఖాళీ స్థలాల కోసం రైతులు ఇలా వరుసలో రాళ్లను పెట్టిన దృశ్యం మదనాపూర్ మండలం కొత్తపల్లి వద్ద అమ్మపూర్ వెళ్లే దారిలో గురువారం కనిపించగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. **- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం**



విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పౌరులు సమాజంలోని చట్టాలను అతిక్రమిస్తే శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఉచిత న్యాయ సేవలు ఉన్నాయని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సఖి కేంద్ర కార్యనిర్వాహకురాలు కవిత, న్యాయవాదులు నరేందర్ బాబు, భరణి కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, సిబ్బంది స్వప్న, భాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని

సన్నరకం ధాన్యాన్ని జాగ్రత్తగా గుర్తించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి న్యూటౌన్, వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనుండటంతో సన్నరకం ధాన్యాన్ని గుర్తించడంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం వనపర్తి పట్టణం నాగవరం రైతు వేదికలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల (పీపీసీ)కు సన్నరకం గుర్తించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్ గ్రెయిన్ కాలిబర్ మీటర్‌ను గుర్తించడం నేర్చుకోవాలన్నారు. ఏదైనా కేంద్రం నుంచి తప్పుగా ధాన్యాన్ని లోడ్ చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే ఏఈఓ లను సంప్రదించాలన్నారు. వర్ష సమాచారం తెలుసుకొని ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సదస్సులో పౌరసరఫరాలశాఖ డీఎం ఇర్ఫాన్, డీసీవో ప్రసాదరావు, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, ఆర్డీవో పద్మావతి, జిల్లా వ్యవసాయశాఖాధికారి గోవిందునాయక్, తహసీల్దార్ రమేశ్ రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులు, ఐకేపీ, సహకార సంఘం, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు రాక

పాలమూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రహదారిలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో ఏటీసీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మెట్టుగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టాస్క్ కేంద్రం కోసం స్థల పరిశీలన చేస్తారని, తర్వాత రెడ్డి బాలికల వసతిగృహం సమీపంలో వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం దివిటిపల్లి సమీపంలో ఉన్న ఐటీ టవర్‌ను పరిశీలన చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

26న గుండె వ్యాధుల వైద్య శిబిరం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం టీచర్స్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 26న ఎన్ఎండీసీ లిమిటెడ్ సహకారంతో హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండె సమస్యలున్న చిన్నపిల్లలకు గుండె వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ శిబిరంలో శనివారం ఉదయం 10 గంటల మధ్యాహ్నం 3 గంటల వరకు చిన్నారులకు చిన్నపిల్లల వైద్యులతో పాటు కార్డియాలజీ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 2డీ ఎకో సేవలు సైతం పొందవచ్చన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే వారు పాత నివేదికలతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు విధిగా వెంట తీసుకురావాలన్నారు. పూర్తి వివరాల కోసం చరవాణి నంబరు 9154289381ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్థాయి ఎంజేపీ క్రీడలు రెండు రోజులుగా మండలంలోని చిట్యాల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో కొనసాగుతున్నాయి. గురువారం వివిధ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరినట్లు ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్ తెలిపారు. శుక్రవారం జరిగే ఫైనల్ టెన్నికాయిట్‌లో చిట్యాలతో బూర్గుపల్లి, ఖోఖోలో చిట్యాలతో నవాబుపేట్, కబడ్డీలో నవాబ్ పేట్‌తో మక్తల్, చదరంగంలో కడుకుంట్ల, కేటీదొడ్డిలకు చెందిన గురుకుల పాఠశాల జట్లు తలపడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయమ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ సెమీఫైనల్ తలపడుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

పాన్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లరాళ్లపల్లి, పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో అనీమియా ముక్త్ భారత్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ తారశశాంక, సీహెచ్‌వో రామయ్య, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం: కేసు నమోదు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి (23) వారం రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... యువతి మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఐటీఐ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంది. కళాశాల దగ్గరికి వెళ్లి ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసి వస్తానని చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యంపై...

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే: మహిళా అదృశ్యమైన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త ఇంటి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో లేకపోవడంతో, ఇరుగు పొరుగు వారిని, బంధువులను అడిగిన ఆమె ఆచూకీ తెలియలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో పరికరాల ధ్వంసం

అమరచింత, న్యూస్‌టుడే: నందిమల్ల గ్రామానికి చెందిన గోవింద్ పొలంలో వ్యవసాయ పరికరాలు అదే గ్రామానికి చెందిన కుర్వ రంగన్న అతని కుమారులు ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై బి.సురేశ్ తెలిపారు. ఈ భూమి విషయంలో గోవింద్, కుర్వ రంగన్నలకు కోర్టుకు వెళ్లారని పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న పొలంలోకి వెళ్లి రంగన్నతో పాటు కుమారులు కలిసి నష్టం కలిగించినందుకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం నందిమల్లగడ్డ నుంచి వనపర్తికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం.. పట్టణంలోని నందిమల్లగడ్డకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంత్ గురువారం ఇసుకను వనపర్తికి తరలిస్తున్నారు. ఇసుకను తరలిచేందుకు అనుమతిపత్రాలివ్వమని అడగగా చూపకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు యజమానికి అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన విజయ్ అనే వ్యక్తి వాగు నుంచి గ్రామానికి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను తరలించేందుకు అనుమతిపత్రాలివ్వమని డ్రైవర్‌ను అడగగా చూపలేదు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొండచిలువ మృతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రామకృష్ణాపురం సమీపంలో ఓ కొండచిలువ మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. గ్రామస్థులు పొలం వద్దకు వెళ్లగా జూరాల (రామన్‌పాడు) కాల్వ పక్కనే ఓ పెద్ద కొండచిలువ మృతి చెంది పడి ఉంది. దానిని ఎవరైనా చంపారా..? లేక ప్రమాదవశాత్తు మృతి చెందిందా అనేది తెలియరాలేదు. భారీ కొండ చిలువ కళేబరాన్ని చూసి గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్రలో 1.07 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో 1,07,250 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. జలాశయం నుంచి 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద గురువారం 13.1 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.3 అడుగులుగా ఉంది.

అదుపుతప్పితే.. అధోగతే

ఖిల్లాగణపురం మండల కేంద్రంలోని మండల కార్యాలయ సమీపంలో వాలాద్రి వాగుపై నిర్మించిన వంతెన ఇది. మూడు నెలలుగా వాహనాలు కొత్త వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన నిర్మాణం పూర్తయిననూ వంతెనను ఆనుకుని ఉన్న మట్టికట్టకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టికట్ట క్రమంగా కోతకు గురవుతుంది. వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా పై నుంచి వాగులో పడితే ప్రాణాపాయమే. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం అధికంగా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– ఈనాడు, మహబూబ్‌నగర్



వంతెన పక్కన నిర్మించని రక్షణ దిమ్మెలు



మరోవైపు కోతకు గురవుతున్న మట్టికట్ట

అభివృద్ధికి నిధులు కేటాయించండి

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: వీపనగండ్ల మండల కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటికి మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బీరయ్య, ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, గోపి, భరత్, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బస్సులు ఆపాలని వినతి

పెబ్బేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనికి చెందిన ఓ బాలింత గురువారం అత్యవసరంగా వనపర్తి ఆసుపత్రికి వెళ్లాల్సి రావడంతో, ఆ కాలనీ బస్‌స్టాప్‌లో గంటకు పైగా బస్ కోసం ఎదురుచూసినా బస్సులు ఆపకపోవడంతో మహిళ కుటుంబ సభ్యులు బస్ డ్రైవర్లతో వాదనకు దిగారు. అనంతరం కాలనీ వాసులు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి పెబ్బేరు నుంచి వనపర్తికి వెళ్లే బస్సులు అంబేడ్కర్‌నగర్ బస్‌స్టాప్‌లో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

బాలల హక్కుల పరిక్షణకు చర్యలు

మదనాపురం, న్యూస్‌టుడే: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన మనందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి లక్ష్మమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు కాపాడాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని, బాల, బాలికలను పనికి పంపకుండా వారిని బడిలో చేర్పించేందుకు ఈ కమిటీలు పని చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున్, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఎంఈవో ఫారుక్ హుస్సేన్, ఎంపీవో ఉషనప్ప, వైద్యాధికారి భవానిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రవిరాజు, రజనికాంత్, తదితరులు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే: బాల్య వివాహాలకు ఎవరూ ప్రోత్సహించొద్దని ఎంపీవో నర్సింహ్మయ్య అన్నారు. గురువారం మండలంలోని చంద్రనాయక్ తండాలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు ఉండాలని అప్పుడే కుటుంబ సభ్యులు వివాహం చేయాలని సూచించారు. మూఢనమ్మకాల పేరుతో పెళ్లిళ్లు చేస్తే పిల్లల జీవితం నాశనమవుతుందన్నారు. చట్ట ప్రకారం వివాహం చేసి ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి శిల్ప, శంకర్ నాయక్, కార్యదర్శి సుచిత్ర, అంగన్‌వాడీ టీచర్ రేణుక లత పాల్గొన్నారు.

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: గ్రామాల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సరస్వతి అన్నారు. గురువారం పెద్దమందడి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖ పరిధిలోని బాలల పరిరక్షణ విభాగం, ఛైల్డ్ లైన్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలల పరిరక్షణ నూతన కమిటీ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాలల పరిరక్షణకు కమిటీ పనిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో సద్గుణ, ఎంపీవో పుష్ప, ఎస్సై యుగంధర్‌రెడ్డి, ఎంఈవో విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు

భారాసకు కార్యకర్తలే బలం: మాజీ మంత్రి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: భారాసకు కార్యకర్తలే బలమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వసురాం తండాలో గురువారం ఆయన పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని రైతులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పూర్తిస్థాయి రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వసురాం తండాకు చెందిన పార్టీ కార్యకర్త మున్యనాయక్ ప్రమాదవశాత్తు కిందపడి గాయాలు కావడంతో ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ సామ్యనాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్

మదనాపురం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం ఎంపీవో ఉషనప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, కార్మికులు ఆంజనేయులు, మధు, జహంగీర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలకు వేలం పాట

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సత్యహళ్లిలో గురువారం మద్యం అమ్మకాలకు అక్రమంగా వేలం పాట నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో పలువురు పాల్గొని వేలం పాడారు. చివరికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏడాదికి రూ. 22 వేలు పంచాయతీకి చెల్లించడానికి వేలం పాడాడు. దీంతో ఏడాది పాటు ఆయనే గ్రామంలో మద్యం అమ్మకాలు చేసేందుకు అనధికారికంగా అనుమతి ఇచ్చారు. ఇతరులు అమ్మకాలు చేపడితే రూ.5 వేలు జరిమానా విధించనున్నట్లు తీర్మానం చేశారు. దీనిపై ఆబ్కారీ ఇన్‌ఛార్జి సీఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా వేలం పాడిన విషయం మా దృష్టికి రాలేదన్నారు. వేలం పాటలు నిర్వహించేందుకు అనుమతులు లేవని, అలా చేస్తే మద్యం అమ్మకాలపై దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

పెద్దమందడి (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దమందడి, ఖిల్లాగణపురం ఎంఈవోలు విష్ణు, జయశంకర్ అన్నారు. మండలంలోని బలిజపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సొంతంగా నిధులతో విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. బలిజపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరమ్మ, బలిజపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు మంజులత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

పట్టణ శివారులోని పెద్ద పీర్ల బావి పరిసరాలలో ఉన్న పొలాల్లో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పలు రైతులు బోర్ల ద్వారా వ్యవసాయం చేస్తుండటంతో దూరంగా ఉన్న స్తంభాల నుంచి కేబుల్ నుంచి తీసుకున్నారు. పలు చోట్ల స్తంభాలు కూడా ఒరిగి ఉన్నాయి. గాలి, వాన వస్తే తీగలు తగిలి బోర్లు కాలిపోతున్నాయి. పొలాల మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్తు తీగల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. అవసరం ఉన్న చోట విద్యుత్తు అధికారులు స్తంభాలు పాతి తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్తు శాఖ ఏఈ రాంచంద్రయ్యను వివరణ కోరగా విరిగిన స్తంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయించి తీగలు కిందకు వేలాడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, అమరచింత**



కాల్వ దారి.. ప్రమాదకరంగా మారి



మండలంలోని అప్పరాల సమీపంలో ఉన్న జూరాల (రామన్‌పాడు) కాల్వ గుంతలతో అధ్వాన్నంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది గ్రామానికి చెందిన దంపతులు అజ్జకొల్లు నుంచి గ్రామానికి వస్తుండగా గుంతలదారిలో అదుపు తప్పి రాత్రి వేళ కాల్వలో పడిపోయారు. అదృష్టవశాత్తు ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రతి ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్న నేటికి నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై రామన్‌పాడు కాల్వల పర్యవేక్షణ ఏఈఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతామన్నారు. **– న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం**

(c) eenadu